"నాన్నా!"

"ఊఁ."

"మరే, నాన్నా ..."

ఏదో వ్రాసుకుంటున్న నేను తల పైకెత్తకుండానే "ఊఁ" అన్నాను మళ్ళీ.

"మీ రాతకు అంతూ పంతూ ఉంటేనా? అసలు రాత సరిగా ఉండాలి గానీ ... అమ్మాయి ఏదో చెప్పాలని ఇందాకట్నుంచీ ముచ్చటపడుతోంటే, కారేమో వినిపించుకోరాయె ... మీ రాతా, మీరూను ..." మా శ్రీమతి వంటకం లోపల్నుంచి వినిపించింది.

ఇక తల పైకెత్తక తప్పలేదు.

"నాన్నా ... నిన్న రాత్రి ... నాకో కలొచ్చింది ..."

"అలాగా, అమ్మా!"

"మరే నేను పాసయినట్లు మేష్టారు చెప్పారు ..."

"కల్లోనా!"

"అవు న్నాన్నా."

"నిజంగానా?"

"అవు న్నాన్నా — కలలో కనిపించి చెప్పారు."

మా అమ్మాయి ముఖం చూడ్డమే గదా, ఎంత సంతోషంగా ఉందని! కళ్ళలో ఏదో ఒక కొత్త కాంతి. రోజూ చూస్తున్న

**డాక్టర్ చల్లా రాధాకృష్ణ శర్మ**

ముఖమే అయినా, ఎందుకో ఈ వేళ కొత్తగా కనిపించింది.

"మరి, నే నయిదో క్లాసు పాస య్యాను గదా ... మాంఛి పట్టు గౌను కుట్టిస్తా నన్నావు. కుట్టిస్తావా, నాన్నా!"

"అలాగే నమ్మా."

"కుట్టించాలి, నిజంగా."

"అలాగే కానీ."

"కానీ, ఏమిటి, నాన్నా?"



# పరీక్షలు చేసిన పరీక్ష

"రిజల్ట్సు రానీ."

"నేను తప్పకుండా పాసవుతాను మేష్టారు చెప్పారుగా."

"అలా చెప్పారు."

"అవును."

"ఒకవేళ ఈ ఏడు కాకపోతే ..."

అంతే. మా అమ్మాయి ముఖం మేఘావృతమైన చంద్రబింబ మయింది. కళ్ళలో ఇందాక కనిపించిన ఆ కాంతి మాయమయింది.

ఆ పాడు మాట నే నెందుకన్నానా అనిపించింది. బాధపడ్డాను.

అవును మరి ఉద్యోగ పర్వంలో ప్రవేశించినవాడు ప్రయత్నం చేసిన ఉద్యోగం రాకేరంటే ఎలా కుంగిపోతాడో అలా ముఖం పెట్టుకుంది, ఈ పిల్ల. కానేమో అది పసిమనిషి. పరీక్ష ఇచ్చింది అయిదో తరగతే అయినా, అదే దాని పాలిటికి బి. ఎ. నో, ఎమ్. ఎ.నో.

"ఊరికే తమాషాగా అన్నా నమ్మా. నువ్వు తప్పకుండా పాసవుతావమ్మా."

"అయితే, పట్టు గౌను ..."

"అలాగే."

"అంటే?"

"కుట్టిస్తామగా!"

"అఁ—అమ్మ కుట్టిస్తారు. ఉత్తుత్తి మాటలే అన్నీ! ఎలాగయితేనేం పాపగా పాపగా పెద్దమ్మాయికి కుట్టించారు పట్టు పావడా ... మా అమ్మడి పెళ్ళి ధర్మమా అని" అని వినిపించింది లోపలినుంచి,

దాంతో నేను నవ్వుకున్నాను. మళ్ళీ నేను నా వ్రాతలో మునిగిపోదామని ప్రయత్నించాను. కాని, ఎందుకో కలం కొంచెం ఆగింది.

"మరే, మా నాన్న కూడా పట్టు గౌను కుట్టిస్తా నన్నారుగా ... ఏమో, పాపా... నిన్న రాత్రి కల్లో నాకు మన మేష్టారు కనిపించారు."

"[illegible]?"

"ఆ — అలా అనే. అయినా మంచి మేష్టారు!"

"[illegible]?"

"నేను పాసయ్యానని చెప్పారే."

"అవును. మా నాన్నగారు పుస్తకాలు తర్వాతగా ... పెళ్ళి చెప్పి ఉంటారు..."

ఇక నా వ్రాత సాగలేదు. నాకు సంతోషం కలిగింది కూడా. సీత మా అమ్మాయి స్నేహితురాలు; సహాధ్యాయిని కూడా. మా అమ్మాయి కంటె కొంచెం పెద్ద. పిల్ల కొంచెం, పాత ఘనం అనిపించింది ఆ అమ్మాయి మాటలు వింటుంటే.

"మా నాన్న ఏం చెప్పిందే. మేష్టారు మా నాన్న చెప్పారా మాదంటే."

"మొన్న మా అన్నయ్య ఆయనతో మాట్లాడుతుంటే చూశానుగా నేను?



నన్ను పాస్ చెయ్యమని మా అక్కయ్య చెప్పి ఉంటుంది."

అందుకు మా అమ్మాయి ఏం జవాబు చెప్పిందో నాకు వినిపించలేదు.

మళ్ళీ సీత మొదలుపెట్టింది.

"వెనకాల బెంచీలో కూర్చుంటుందే, విమల, అది లేదూ ..."

"లేకేం ..."

"దాన్ని పోయిన సంవత్సరం మన మేష్టారే ఫెయిల్ వేయించారు."

"ఎందుకని?"

"ఎందుకంటే ఆయనేమో దాన్ని ఇరవై రూపాయలు అడిగారుట. ఇస్తానందిట. కాని, అప్పుడేమో వాళ్ళ నాన్న గారు ఊళ్ళో లేరు. వాళ్ళమ్మ ఏమో, ఎందుకే డబ్బు ఇవ్వడం, నీకు మార్కులు బాగానే వస్తాయిగా — అందిట. తరవాత డబ్బు ఇవ్వలేదుట ..."

"అందుకని ఫెయిలయిందంటావా?"

"అవును. ఆ పార్టు అంతేట... కావాలంటే ఎవరినైనా కనుక్కో—"

"సార్ని అలా అనకూడదే. పాపం నమ్మేది."

"నువ్వు పాసయ్యావు కాబట్టి, సారు మంచాయన నీకు ..."

మా అమ్మాయి ఏం మాట్లాడలేదు.

ఆ స్నేహితురాలు వెళ్ళిపోయింది.

పరీక్షలు, ఉపాధ్యాయులు, పరీక్షా ఫలితాలు, విద్యా సంస్థలు ... ఇలా రకరకాల విషయాలను గురించి నా మనస్సు ఆలోచించసాగింది.

"నాన్నా! అమ్ముడు ఫెయిల్ అయింది" అంటూ మా పెద్దబ్బాయి ఇంతలో లోపలికి వచ్చాడు.

మా అమ్మాయి ముద్దు పేరు అమ్ముడు. మేమంతా దాన్ని ఇంట్లో అలాగే పిలుస్తాము.

"ఫెయిలయిందా?" ఆశ్చర్యంగా నా కంఠం రుద్ధమయింది.

"పొద్దున్నే బోర్డు కట్టారు, నాన్నా. మన అమ్ముడు పేరు నేను చూస్తే ..."

మా చిట్టి తల్లి ముఖం చూడలేక పోయాను. ముఖం ముడుచుకుపోయి, వాడిపోయిన పువ్వులా కనిపించింది. వెంటనే గదిలోకి వెళ్ళిపోయింది. మంచం మీద పడుకుని ఏడుస్తోంది కాబోలు.

"నువ్వు ఫెయిలు కాలేదమ్మా ... అన్నయ్య సరిగా చూసి ఉండడు. నేను మా స్నేహితుడింటికి ఇప్పుడే వెళ్ళి, బోర్డు చూసి వస్తాగా" అన్నాను తెచ్చుకున్న సంతోషంతో. మా అమ్మాయి ఫెయిల్ అయిందని వినేసరికి, దానికంటే నాకే ఎక్కువ బాధ కలిగింది, నిజం చెప్పద్దూ!

"సరిగ్గా చూశావురా బోర్డు" అన్నాను మా అబ్బాయిని గద్దిస్తూ.

"చూశా నాన్నా! సి. కామేశ్వరి అని రాసి ఉంటే" అన్నాడు వాడు భయపడుతూ.

వెంటనే నేను గదిలోకి వెళ్ళాను. మంచం మీద పడుకుని పుస్తకాల అలమర వైపు వెర్రిగా చూస్తోంది మా అమ్మాయి. చదివిన ఆ పాత పుస్తకాలే మళ్ళీ చదవాలనో, కొత్త పుస్తకాలు కొనుక్కునే అవకాశం తప్పిపోయిందనో, పట్టు గౌను కొనిపెట్టరనో, నలుగురూ నవ్వుతారనో ... మరి ఇంకా ఏమనుకునో ఏమిటో ... అలమర వైపే చూస్తోంది వెర్రిగా, దీనంగా.

నన్ను చూసిందో, లేదో ముఖం పక్కకు తిప్పుకుని, "నాన్నా, నేను బాగానే రాశాను పరీక్షలు" అంది.

"నువ్వు పాసవుతావమ్మా, అన్నయ్య సరిగ్గా చూసి ఉండడు బోర్డు" అన్నాను ఓదారుస్తున్నట్టుగా.

"హాఫియర్లీలో కూడా బాగానే వచ్చాయి మార్కులు ... మరెందుకు ఫెయిలు చేశారు నన్ను? సీత చెప్పిందే— మేష్టారుకి ..." ఇంకా ఏమిటో చెప్ప బోయింది.

"తప్పమ్మా, తప్పు. అలా అనకూడదు మేష్టారు గారిని, తెలిసిందా! లే, ముఖం కడుక్కోరా — మనం బజారుకి వెళదాం. నీకు నచ్చిన గౌను కొనుక్కుందువుగాని" అన్నాను.

"నాకు కొత్త గౌను వద్దు, నాన్నా!"

"పరీక్షలకీ, గౌనుకీ సంబంధం ఏమిటమ్మా? పిచ్చిదానివిగాని ... లే ... ముఖం కడుక్కోరా."

"గౌను వద్దు, నాన్నా."

"కామేశ్వరీ!"

అది సీత గొంతు.

అది వినేసరికి అమ్ముడికి సిగ్గూ, ఏడుపూ ఒక్కసారిగా ముంచుకువచ్చాయి.

మేము బయటికి వచ్చాము.

మా అబ్బాయి ఏదో బొమ్మ గీస్తున్నాడు.

సీత ముఖం చూస్తుంటే, ఆమె పాసయినట్లే అనిపించింది. అంత సంతోషంగా ఉంది. ఆమె చేతిలో ఒక డబ్బా ఉంది.

మా అమ్మాయి పరీక్ష పోయిందనే విచారంతో నేనేమీ మాట్లాడలేక పోయాను. సీతను అభినందిద్దామనుకున్నాను. కాని, అభినందించలేదు. పాడు పరీక్షలు — అనుకున్నాను.

"కామేశ్వరి బజారుకు వెళ్ళిందా అండి" అంటూ సీత మా మధ్య అలుముకున్న మౌనాన్ని ఛేదించింది.

"బజారు కెందుకు?"

"పట్టుగౌను కుట్టించుకుంటానంది."

"అవును."

"ఇదుగోనండి, మీకు స్వీటు" అంటూ డబ్బా తెరిచి నాకో చాకొలెటు ఇచ్చింది సీత. మా వాడికి కూడా ఒకటి ఇచ్చింది.

"మంచిదమ్మా" అన్నాను.

మొదట్లోనే సీతను అభినందించనందుకు నా చిన్న బుద్ధిని చూసి నేను తిట్టుకున్నాను. నాలో ఇంత స్వార్థచింతన గూడు కట్టుకుని ఉన్నట్టు నేనిప్పటికి గాని గ్రహించలేకపోయాను.

"పాసయ్యావన్న మాట! చాలా సంతోషమమ్మా" అన్నాను.

"మరి కామేశ్వరి ఏం ఇస్తుందండీ?"

"ఏమిటి ... ఇవ్వడం? !

"తనూ పాసయింది కదండీ ... పైగా ఇంగ్లీషులో తనదే అండి ఫస్టు మార్కు. ఇప్పుడే బడినుంచి వస్తున్నాను. మేష్టారు చెప్పారు..."

"నిజంగానా, అమ్మా!"

నాలో ఎక్కడో ఒక మూల దాక్కున్న మానవత్వం మళ్ళీ బయటికి వచ్చింది. 'అమ్ముడూ'! అని నేను పిలిచేంతలోపలే మా అమ్మాయి గబగబ బయటికి వచ్చింది, విరిసిన బొండుమల్లెలా.

"నేను నిజంగా పాసయినానంటే, సీతా?" అడిగింది కామేశ్వరి.

"మన సెక్షన్లో ఆ రాణీ లేదూ, అదొక్కర్తే ఫెయిలయిందే."

"పాపం."

"మరే బి. సెక్షన్లో ఉండే కామేశ్వరి, అది కూడా ఫెయిలయింది" అంది సీత.

బొమ్మ గీస్తున్నవాడల్లా, మా అబ్బాయి తల పైకెత్తాడు. "మీ దే సెక్షను?" అని అడిగాడు.

"మాది సి" అంది అమ్ముడు.

మా వాడు తప్పు చేసినవాడిలా ముఖం పెట్టి నా వంక చూశాడు.

నిజం చెప్పవద్దూ. నాకు వాడిమీద కోపం రాలేదు. నవ్వు వచ్చింది.

"మా అన్నయ్యే నేను ఫెయిలయినట్టు చెప్పాడే" అంది అమ్ముడు సీతతో,

సీత బదులుకోసం నేను ఎదురు చూడకుండా "అమ్ముడూ! బజారుకి వెళదాం-పద. మరి నీకు కొత్త గౌను కొనద్దూ!" అన్నాను.

"తరవాత వెళ్ళవచ్చులే, నాన్నా ... ఆ కామేశ్వరి ఇంటికి వెళ్ళి రావాలి ... అది చాలా మంచిది."

"పరీక్ష పోయినందుకు వాళ్ళ అమ్మ దాన్ని కొట్టిందే — పాపం" అంది సీత జాలిగా.

నా మనస్సు తరుక్కుపోయింది. పాడు పరీక్షలు — అనుకున్నాను.

"సారుకి..." ఏమిటో చెప్పబోయింది సీత.

"తప్పమ్మా. మేష్టార్ని ఏం అన కూడదు. గురు దూషణ మంచిది కాదమ్మా" అన్నాను.

కామేశ్వరి ఇంటికి బయలుదేరిన మా అమ్ముడికీ, సీతకూ నా మాటలు వినిపించాయో, లేదో? ★